
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
14-7-2026 (Tuesday)
MAIN EDITION

## కర్ణాటక మాజీ మంత్రి మృతి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** కర్ణాటక మాజీ మంత్రి రామచంద్ర గౌడ(88) కన్నుమూశారు. కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో తుది శ్వాస విడిచారు. కర్ణాటకలో బీజేపీ అత్యంత సీనియర్ నాయకులలో ఒకరైన రామచంద్ర గౌడ సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని కలిగి ఉన్నారు. ఆయన రాష్ట్రానికి అనేక కీలక మంత్రి పదవుల ద్వారా సేవలందించారు. విద్య, వైద్య విద్య, పట్టు పరిశ్రమ (సెరికల్చర్), సైన్స్ అండ్ టెక్నాలజీ, చిన్న మొత్తాల పొదుపు, మైనింగ్ & జియాలజీ వంటి కీలక శాఖలను నిర్వహించారు.

## లులు మాల్‌లో గన్ కలకలం..



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్ నగరంలోని కేపీహెచ్‌బీలో గల లులు మాల్‌లో గన్ కలకలం రేగింది. మాల్‌లోని సెల్లార్‌లో పార్కింగ్ ప్రాంతంలో ఓల్డ్‌సిటీకి చెందిన రెండు కుటుంబాల మధ్య గొడవ జరిగింది. దీంతో మాల్ సెక్యూరిటీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను సముదాయిస్తుండగా.. పాతబస్తీకి చెందిన సిద్ధిఖీ జేబులో తుపాకీని గమనించారు. ఆ గన్‌కు లైసెన్స్ ఉన్నట్లు తెలిపారు. భద్రతా సిబ్బంది తనిఖీలు చేయకపోవడంతో గన్‌తో లోపలికి వెళ్లినట్లు గుర్తించారు. దీంతో లులు మాల్ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు.

## ఎల్ఐసీ కీలక నిర్ణయం..




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ప్రముఖ ప్రభుత్వరంగ బీమా సంస్థ ఎల్ఐసీ పాలసీదారులకు ఊహించని షాక్ ఇచ్చింది. ఇప్పటివరకు తమ అధికారిక కస్టమర్ పోర్టల్, మొబైల్ యాప్‌లో అందుబాటులో ఉన్న 'క్రెడిట్ కార్డ్' ద్వారా ప్రీమియం చెల్లించే సదుపాయాన్ని సంస్థ పూర్తిగా నిలిపివేసింది. 15 రోజుల క్రితమే ఎటువంటి ఈ నిర్ణయం అమలులోకి వచ్చినట్లు తెలుస్తోంది.

## ఎస్‌బీఐ ఫండ్స్ ఐపీవో ప్రారంభం




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** ఎస్బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ పబ్లిక్ ఇష్యూక్ వచ్చింది. ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ. 9,813 కోట్లు సమీకరించనుంది. ఎస్‌బీఐ, అముండీ ఇండియా హోల్డింగ్ ఐపీవోలో భాగంగా తమ వాటాలు విక్రయిస్తున్నాయి. సబ్‌స్క్రిప్షన్ జూలై 14న ప్రారంభమై 16 వరకు అందుబాటులో ఉండనుంది. 17న రాత్రి షేర్లు అలాట్ అవుతాయి.

## వేగవంతం కానున్న ఎయిర్‌పోర్టుల పనులు..



**అక్షరటుడే, ఢిల్లీ :** వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 2028 జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ రెండు విమానాశ్రయాలను పూర్తి చేసి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు.

## రేపటి నుంచి రాష్ట్రంలో వర్షాలు



**అక్షరటుడే, హైదరాబాద్ :** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. వేసవిని తలపించేలా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. రేపటి నుంచి ఎండలు తగ్గుముఖం పడుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. జూలై 15 నుంచి పశ్చిమ, ఉత్తర తెలంగాణలో అక్కడక్కడా వర్షాలు మొదలవుతాయి. మంగళవారం వాతావరణం పొడిగా ఉంటుంది. జూలై 16-19 మధ్య వర్షపాతం మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా తూర్పు తెలంగాణ జిల్లాల్లో, హైదరాబాద్ నగరంలోనూ అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి.

# ఏసీబీ దూకుడు



**ఏసీబీ అధికారులు దూకుడు పెంచారు. పదవులను అడ్డు పెట్టుకొని భారీగా అక్రమాస్తులు కూడబెట్టిన అధికారుల భరతం పడుతున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు నమోదు చేసి నిందితుల ఇళ్లలో సోదాలు చేపడుతున్నారు. ముఖ్యంగా కీలక స్థానాల్లో పని చేస్తున్న అధికారుల అవినీతిపై ఫోకస్ పెట్టారు. వందల కోట్ల అక్రమాస్తులను వెలుగులోకి తెస్తున్నారు. అంతేగాకుండా లంచాలు తీసుకుంటున్న అధికారులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంటున్నారు.**

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

- **హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ ఇంటిపై దాడులు**
- **పలు అక్రమాస్తుల గుర్తింపు**
- **పెద్దపల్లిలో మున్సిపల్ ఏఈ అరెస్ట్**

హైదరాబాద్ నగరంలో మంగళవారం ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బచ్చు రవీందర్ నివాసంతో పాటు ఆయన బంధువులు, సన్నిహితుల నివాసాలపై దాడి చేశారు. భారీగా అక్రమాస్తులు కూడబెట్టారనే సమాచారంతో ఏసీబీ డీఎస్పీ మాజీద్ ఖాన్ ఆధ్వర్యంలో ఏకకాలంలో 12 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ దాడుల్లో భారీగా అక్రమాస్తులు, నోట్ల కట్టలు, బంగారం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### అవినీతి తిమింగలాలపై..

ఏసీబీ అధికారులు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు అవినీతి అధికారులను వలపన్ని పట్టుకుంటున్నారు. మరోవైపు భారీగా అక్రమా స్తులను కూడబెట్టిన అవినీతి తిమింగలాలపై సైతం చర్యలు చేపడుతున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు నమోదు చేసి, సోదాలు చేపడుతున్నారు. తాజాగా హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ ఇంట్లో సోదాలు చేపట్టారు. గతంలో ఆర్ అండ్ బీ ఈఎన్‌సీ మోహన్ నాయక్ నివాసాల్లో సోదాలు చేసి రూ.200 కోట్ల అక్రమాస్తులను గుర్తించారు. ల్యాండ్, సర్వే డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ ఇంట్లో భారీగా నోట్ల కట్టలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమాస్తుల కేసులో డీఎస్పీ భీమ్ రెడ్డిని ఇటీవల అరెస్ట్ చేశారు. ఏసీబీ దాడులతో అవినీతి అధికారులు భయపడుతున్నారు.

### ఏసీబీకి చిక్కిన మున్సిపల్ ఏఈ

పెద్దపల్లి మున్సిపల్ ఏఈ సతీష్ కుమార్ ఏసీబీకి చిక్కాడు. రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఓ కాంట్రాక్టర్ చేసిన పనులకు బిల్లులు చెల్లించడానికి మున్సిపల్ ఏఈ సతీష్ రూ.4 లక్షల లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఫిర్యాదుదారు నుంచి మంగళవారం రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికకారులు పట్టుకున్నారు. అనంతరం కార్యాలయంలో, ఆయన నివాసంలో సోదాలు చేపట్టారు. ఈ క్రమంలో ఏఈ ఇంట్లో లెక్కల్లో చూపని రూ.32.31 లక్షల నగదును కూడా ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.



## కేంద్ర మంత్రులతో సీఎం భేటీ




**అక్షరటుడే, ఢిల్లీ :** రాష్ట్ర అభివృద్ధిని పరుగులు పెట్టించే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో చర్చలు జరుపుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సీఎం భేటీ అయ్యారు. ఆర్ఆర్ఆర్ నార్త్ పార్ట్ పనుల ప్రారంభానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపాలని, అలాగే సదరన్ పార్ట్ కు సంబంధించిన అన్ని అనుమతులు త్వరితగతిన మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని జాతీయ రహదారులను డ్రైపోర్ట్‌లకు అనుసంధానం చేస్తూ, రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేలా అనుమతులు ఇవ్వాలని కోరారు. అనంతరం విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో భేటీ అయ్యారు.

## బ్యారేజీల సమస్య వస్తే రాజీనా చేస్తాం: కౌశిక్ రెడ్డి




**అక్షరటుడే, కరీంనగర్:** కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయాలని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆ క్రమంలో అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు ఏ చిన్న సమస్య ఎదురైనా, తాము అందరం బాధ్యత వహిస్తూ ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేస్తామని, మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయమన్నారు. ఈ సవాల్‌ను స్వీకరించే ధైర్యం ముఖ్యమంత్రికి ఉందా అని ఆయన ప్రశ్నించారు. రైతుల ఆవేదనను చూసి తాము ఈ నిర్ణయం తీసుకున్నామని, రైతులకు నీళ్లు ఇచ్చే విషయంలో ప్రభుత్వం చిల్లర రాజకీయాలు చేస్తోందని ఆయన ఆరోపించారు. నీళ్లు ఇస్తే ఎరువులు ఇవ్వాల్సి వస్తుందని, పంటలు కొనాల్సి వస్తుందనే భయంతోనే ప్రభుత్వం రైతులకు నీటిని అందించడం లేదని ఆయన విమర్శించారు.

## ఇరాన్ 'అణు కోట'పై ట్రంప్ గురి..



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న వేళ, ఇరాన్‌లోని అత్యంత రహస్య అణు కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం అంతర్జాతీయంగా తీవ్ర చర్చలకు దారితీస్తోంది. ఇరాన్‌లోని నటాంజ్ అణు క్షేత్రానికి సమీపంలో ఉన్న 'పికియాక్స్ పర్వతం' ఇప్పుడు ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలకు కేంద్ర బిందువుగా మారింది. ఇది ఇరాన్‌లోనే అత్యంత లోతైన, సురక్షితమైన భూగర్భ అణు కేంద్రం. ఈ పర్వతంలోని గట్టి గ్రానైట్ రాళ్లను తొలిచి, దాదాపు 2,000 అడుగుల లోతులో ఇరాన్ తన అణు మౌలిక వసతులను నిర్మించుకుంది. ఇక్కడ యురేనియం శుద్ధి చేసే హాళ్లు, అణు ఇంధన నిల్వలు ఉన్నాయి. గతంలో ఉన్న 'ఫోర్డో' కేంద్రం కంటే ఇది ఎంతో బలంగా, వైమానిక దాడులను తట్టుకునేలా ఉంది.

## లడ్కీ బహిన్ పథకంలో 92 లక్షల లబ్ధిదారుల తొలగింపు




**అక్షరటుడే, మహారాష్ట్ర:** మహారాష్ట్ర ప్రభుత్వం మాఝీ లడ్కీ బహిన్ యోజన జాబితా నుండి 92 లక్షల మహిళల పేర్లను ప్రభుత్వం తొలగించింది. ఈకేవైసీ ప్రక్రియ తర్వాత అనర్హులపై వేటు వేసినట్లు పేర్కొంది. ఈ పథకం కింద అర్హులైన మహిళలకు నెలకు రూ.1,500 సాయం అందుతుంది. తాజా తొలగింపు తర్వాత 2.47 కోట్ల నుంచి 1.70 కోట్లకు లబ్ధిదారులు తగ్గిపోయారు. ఎన్నికల తర్వాత మహిళలను మోసం చేశారని ప్రతిపక్షాలు విమర్శించాయి. ఈ కేవైసీ చేయని వారిని, అనర్హులను తొలగించినట్లు ప్రభుత్వం తెలిపింది.

## ముగిసిన రాజ్‌కుమార్ అంత్యక్రియలు



**అక్షరటుడే, రంగారెడ్డి :** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడలో ఆరు హత్యలు చేసిన రాజ్‌కుమార్ అంత్యక్రియలు పూర్తయ్యాయి. అతడి కుటుంబ సభ్యులు మృతదేహం తీసుకు వెళ్లడానికి నిరాకరించారు. రాజ్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. సోమవారం సాయంత్రం అతడి మృతదేహాన్ని చేవేళ్ల ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తీసుకు వెళ్లడానికి కుటుంబ సభ్యులు నిరాకరించారు. చేవెళ్ల మున్సిపాలిటీ సిబ్బంది సహకారంతో పోలీసులు అంత్యక్రియలు నిర్వహించారు.

## పెళ్లి వద్దని గుండు గీయించుకున్న యువతి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ప్రముఖ సోషల్ మీడియా క్రియేటర్ కీర్తనా మీనన్ పెళ్లి విషయంలో తన కుటుంబ సభ్యుల నుంచి ఎదుర్కొంటున్న ఒత్తిడిని భరించలేక, వినూత్నంగా నిరసన వ్యక్తం చేసింది. పెళ్లి బారి నుంచి తప్పించుకునేందుకు ఆమె ఏకంగా గుండు గీయించుకుని, ఆ వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేసింది. జుట్టు అంటే తనకు ఎంతో ఇష్టమని పేర్కొన్న కీర్తన, తన వ్యక్తిగత స్వేచ్ఛ, జీవిత నిర్ణయాలను తీసుకునే హక్కును కాపాడుకోవడం కోసం ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. కుటుంబ సభ్యుల బలవంతపు పెళ్లిళ్ల ఒత్తిడితో సతమతమవుతున్న ఎంతో మంది యువతులకు తన చర్య ఒక సందేశమని ఆమె అభిప్రాయపడింది.

## యూఏఈ ఆయిల్ ట్యాంకర్లపై ఇరాన్ దాడి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** హర్మూజ్ జలసంధిలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జెండా కలిగిన రెండు చమురు ట్యాంకర్లపై ఇరాన్ క్రూయిజ్ క్షిపణులు మంగళవారం దాడి చేశాయి. ఈ ఘటనలో ఒక భారతీయ సిబ్బంది మరణించగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారని యూఏఈ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఒమన్ ప్రాదేశిక జలాల్లోని జలసంధి దక్షిణ షిప్పింగ్ మార్గం మీదుగా ప్రయాణిస్తున్నప్పుడు 'మొంబాసా', 'అల్ బహియా' అనే ట్యాంకర్లపై దాడి జరిగిందని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. మరణించిన భారత జాతీయుడు 'మొంబాసా' నౌకలో పనిచేస్తున్నాడు. గాయపడిన ఎనిమిది మందిలో ఆరుగురు భారత జాతీయులు కాగా, ఇద్దరు ఉక్రెయిన్‌కు చెందినవారు ఉన్నారు. ఈ దాడిని యూఏఈ రక్షణ మంత్రిత్వ శాఖ ఖండించింది.